ఆ రోజు ఆదివారం కాదు. ఏదో సెలవు రోజు. అయినా, పిల్లలూ ఇంట్లోనే ఉన్నారు. మధ్యాహ్నం భోజనాలు చేయడం అయింది. నేనింకా భోజనాల బల్ల సర్దుతున్నాను. ఆయన ఏమన్నా కాస్త సాయానికి వస్తారేమోనని చూసాను. అప్పటికే పడక్కుర్చీలో సర్దుకున్నారు.

"భోంచెయ్యగానే సిగరెట్ ముట్టించారా అప్పుడే! సిగరెట్ కాల్చడం నిషేధం అని తెలియదూ?" అన్నాను.

"అది బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే. ఇంట్లో కాదు" అన్నారు నిశ్చింతగా పొగవైపు చూస్తూ.

"ఇంట్లో నేను, పిల్లలూ ఉన్నాం. బహిరంగంగా వాళ్లెదురుగా కాలిస్తే రేపు బాబిగాడు కూడా నేర్చుకుంటాడు మిమ్మల్ని చూసి" అన్నాను హెచ్చరిస్తూ.

"నీ ముస్తాబులు చూసి పాప నేర్చుకోవడం లేదూ?" అన్నారు దెబ్బకి దెబ్బ చూసుకోమన్నట్లు.

"అదీ ఇదీ ఒకటేనా? ముస్తాబు చేసుకుంటే ఆరోగ్యం పాడవుతుందా? పౌడరు సిగరెట్‌లా పాడు కంపు కొడుతుందా?" అన్నాను ఊరుకోకుండా.

"తాగితే తాగొచ్చానంటావ్, సిగరెట్ కాలిస్తే కాల్చానంటావ్ – ముందు నన్ను కాల్చుకు తినడం మాను" అన్నారు.

"ఇంట్లో ఇలా పొగపెడితే నేనూరుకోను. రిపోర్ట్ చేస్తాను" అన్నాను బెదిరిస్తున్నట్లు నటిస్తూ.


"ఏం, నువ్వు ప్రభుత్వానికి ఏజంటువా? మొగుడేదైనా చేస్తే సమర్థించడం పోయి వీధికెక్కుతావా? ఇదేనా పాతివ్రత్యం అంటే?" అని నిలదీసారు గంభీరస్వరంతో.

"ఓహో! మీకింకా తెలియదా? ఇటీవల పాతివ్రత్యానికి నిర్వచనం మారింది! పాతివ్రత్యం అంటే భర్తకి దాసోహం అనడం కాదు. పతిని దారిలో పెట్టేదే పాతివ్రత్యం" అన్నాను.

"భర్తకు అర్థం కూడా మారిందిలే. భర్త అంటే భార్య ఏం చేసినా భరించే వెర్రిముండావాడు కాదు" అన్నారు వెటకారంగా.

# అన్యోన్యతకు అర్థమేమిటి

అబ్బూరి ఛాయాదేవి



"అబ్బే. మీకింకా తెలియదేమో - భర్త అంటే భరించలేనివాడు - అని మారిందండీ! అందుకే కదా అన్ని పనులూ భార్య మీదికి తోసేసి, స్నేహితులతో స్వేచ్ఛగా తిరుగుతుంటాడు! పెళ్లాం ఉద్యోగం చెయ్యడం మొగుడికి మరింత స్వేచ్ఛనివ్వడానికా?" అన్నాను.

"అబ్బే... సంపాదిస్తున్నాను కదా అని స్వేచ్ఛగా రోజుకో చీర కొని, కట్టుకుని ఆఫీసులో ప్రదర్శించడానికి!" అన్నారాయన.

"మీ మగబుద్ధి పోనిచ్చుకున్నారు కాదు. మీరు ఆఫీసులో రోజూ చేసే పని ఇదేనా - ఏ ఆడ 'కొలీగ్' ఏ చీర కట్టుకుని వచ్చిందా అని పరిశీలించడమేనా?" అన్నాను.

"అంత కష్టం దేనికి? నిన్ను చూస్తే చాలదూ!" అన్నారు వంకరగా నవ్వుతూ.

"అయ్యో రామ! నన్ను చూడ్డం కూడానా! చూసి ఏనాడైనా మెచ్చుకున్న పాపాన పోయారా? - ఎంత తగలేసావ్ అనడం తప్ప!"

అన్నాను.

"నేనేం భట్రాజుని కాదు నిన్ను పొగుడుతూ కూర్చోడానికి!" అన్నారు గడుసుగా.

"అబ్బే మగమహారాజు! ఆఫీసులోని ఆడ వాళ్లని మాత్రమే పొగుడుతారు - అప్పుడే పుణ్యం, పురుషార్థం!" అన్నాను నేను కూడా వంకరగా నవ్వి.

"మీ బాసు నిన్ను ఏమని పొగిడాడో నిన్నె ప్పుడైనా అడిగానా? నువ్వు చెబుతున్నావా నాకు?" అంటూ మరో దాడి మొదలుపెట్టారు.

"చెబితే భరించగలరా?" అన్నాను కొంటెగా నవ్వుతూ.

"అలాంటివన్నీ భరించలేకే ఈ సిగరెట్ కాల్చడం!" అన్నారు మళ్లీ మొదటికొచ్చి.

"ఏమీ చెప్పకుండానే ఊహించి సిగరెట్ కాల్చేస్తున్నారు! చెబితే ఏం చేస్తారు? కిరస నాయిలు పోసి నన్ను కాలుస్తారా?" అన్నాను నడుంమీద చేతులు పెట్టుకుని.

"ఇదుగో, నాకనవసరంగా సూచనలివ్వకు! అసలే నా మూడ్ బాగాలేదు" అన్నారు.

"నన్ను చూస్తే మీ 'మూడ్' ఎప్పుడు బావుం టుందో చెప్పండి? మీకిష్టమైన వంటలు చేసి పెట్టినప్పుడేనా?... అప్పుడైనా ప్రేమని ప్రదర్శిం చడం వచ్చా మీకు?" నిలదీసాను.

'ఎప్పుడైనా వంటింట్లోకి వెనక నుంచి వచ్చి ఏదైనా చెయ్యబోతే కెవ్వుమంటావు కదా! - పనిమనిషి చూస్తుందనో, పిల్లలు చూస్తారనో?" అన్నారు అమాయకంగా.

"వంటిల్లు బహిరంగ స్థలం - ప్రేమని ప్రద ర్శించే స్థలం కాదు" స్పష్టం చేసాను.

"పోనీ రాత్రి సమయంలో 'మూడ్' వచ్చి దగ్గరికి తీసుకుందామంటే ఖస్సుమంటావ్ నీ 'మూడ్' బాగాలేదని!" అన్నారు నిస్సహాయంగా మొహంపెట్టి.

"చూసారా! అన్యోన్య దాంపత్యం అంటే ఇదే! ఒకసారి మీకు, ఒకసారి నాకూ 'మూడ్' బాగాలేదనుకోవడం - 'మూడ్స్' సరిగ్గా కుదరని అన్యోన్యత అన్నమాట! - సమానత్వం ఇందు లోనైనా ఉండాలి కదా!" అన్నాను.

## నానీల సంకలనానికి అవార్డ్

డా॥ పెళ్లకూరు జయప్రద సోమిరెడ్డి తన చెల్లెలు స్వర్గీయ సోమిరెడ్డి జమున పేరున రాష్ట్రస్థాయిలో ప్రతి సంవత్సరం జరుపుతున్న సోమిరెడ్డి జమున పురస్కార ప్రదానోత్సవం సందర్భంగా ఈ సంవత్సరం కూడా పురస్కార ఎంపిక కోసం 2008లో ప్రచురించబడ్డ నానీల సంకలనాలు ఒక్కొక్కటీ నాలుగు ప్రతుల చొప్పున జూన్ 30వ తేదీలోపుగా ఈ క్రింది అడ్రసుకు పంపవలసిందిగా కోరుచున్నారు. ఎంపికైన పుస్తక రచయితకు ఆత్మీయ పురస్కారంతో బాటు 3,000 రూపాయలు నగదు, జ్ఞాపిక సెప్టెంబరు నెలలో జరిగే అవార్డ్ ప్రదానోత్సవ సభలో అందజేయడం జరుగుతుంది.

పుస్తకాలను యస్.వి.యస్. రెడ్డి, వంశీ పబ్లికేషన్స్, వంశీ నర్సింగ్ హోమ్ కాంపౌండ్, ఇందిరానగర్ రోడ్డు, నెల్లూరు - 524001 (సెల్: 94402 79594) అనే చిరునామాకు పంపించాలి.